# రామగుండం మేయర్‌గా మహంకాళి స్వామి

**✻ డిప్యూటీ మేయర్‌గా పాతపెల్లి ఎల్లయ్య ✻ ప్రమాణ స్వీకారం చేసిన 49 మంది కార్పొరేటర్లు**



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక సంస్థలో నూతనంగా ఎన్నికైన 49 మంది డివిజన్ కార్పొరేటర్లు సోమవారం నగరపాలక కార్యాలయం కౌన్సిల్ హాలులో ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో హాజరైన డివిజన్ కార్పొరేటర్లతో ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. నరేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సమావేశానికి బి.ఆర్.ఎస్. పార్టీ నుండి గెలిచిన 10వ వార్డు సభ్యులు అద్దాల గట్టయ్య , 40వ డివిజన్ కార్పొరేటర్ కజంపురం జయప్రద తప్ప మిగిలిన 11 మంది వార్డు సభ్యులు హాజరు కాలేదు. తెలుగు అక్షరమాల ప్రకారం 10వ డివిజన్ కార్పొరేటర్ అద్దాల గట్టయ్య మొదట ప్రమాణం చేయగా ఆఖరున 17వ డివిజన్ అనుము స్వరూప ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం మేయర్ , డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. మేయర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 46వ డివిజన్ కార్పొరేటర్ మహంకాళి స్వామి పేరును 9వ డివిజన్ కార్పొరేటర్ తాళ్ళపెళ్ళి యుగంధర్ ప్రతిపాదించగా 38వ డివిజన్ కార్పొరేటర్ నెలికంటి రాము బలపరిచారు. మరో ప్రతిపాదన రాకపోవడంతో మేయర్ పదవికి మహంకాళి స్వామి ఎన్నికైనట్టుగా ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఆ తరువాత డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రారంభమైంది. డిప్యూటీ మేయర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 57వ డివిజన్ కార్పొరేటర్ పాతపెల్లి ఎల్లయ్య పేరును 30వ డివిజన్ కార్పొరేటర్ ఇసంపల్లి అంజయ్య ప్రతిపాదించగా 31వ డివిజన్ కార్పొరేటర్ షాహెదా బలపరిచారు. మరో ప్రతిపాదన రాకపోవడంతో డిప్యూటీ మేయర్ గా పాతపెల్లి ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఈ సమావేశంలో రామగుండం నియోజకవర్గం శాసన సభ్యులు, నగరపాలక సంస్థ ఎక్స్ అఫిషియో సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ , ఎన్నికల పరిశీలకులు పద్మజా రాణి, నగర పాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేయాలి!**

**ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ :** నూతన పాలకవర్గం ప్రజా సంక్షేమమే పరమావధిగాపనిచేయాలని రామగుండం నియోజకవర్గం శాసన సభ్యులు, నగరపాలక సంస్థ ఎక్స్ అఫిషియో సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సూచించారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో సోమవారం నిర్వహించిన మేయర్, డిప్యూటీ మేయర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల కార్పొరేటర్లు దృష్టి సారించాలని అన్నారు. పార్టీ విధేయత, సీనియారిటీ,అనుభవం ప్రాతిపదికన మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు అభ్యర్థులను అధిష్టానం ఎంపిక చేయడం జరిగిందని అన్నారు.

**ఎమ్మెల్యే సహకారంతో రామగుండం అభివృద్ధి!**

**నగర మేయర్ మహంకాళి స్వామి:**స్థానిక శాసన సభ్యుడు ఎంఎస్‌రాజ్ ఠాకూర్ నేతృత్వంలో రామగుండం నగరాన్ని ఇంకా బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని కొత్తగా ఎన్నికైన రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గత 20 ఏళ్లుగా ప్రజా సేవలో ఉంటూ మూడు సార్లు కార్పొరేటర్ గా గెలిచి పార్టీకి విధేయుడుగా ఉన్నానని అన్నారు. తాను మేయర్ గా ఎన్నిక కావడానికి సహకరించిన కార్పొరేటర్లకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో అన్ని ప్రాంతాలకు రక్షిత మంచి నీటి సరఫరా, రోడ్లు, మురుగు నీటి కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ అందుబాటులోకి తెచ్చే విధంగా పనిచేస్తామని అన్నారు.

**ప్రగతి పథంలో ముందుకు వెళ్తాం!**

**డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య:** ప్రగతి పథంలో ముందుకు దూసుకు వెళుతున్న రామగుండం నగర అభివృద్ధిలో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య అన్నారు.సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో డిప్యూటీ మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీకి కట్టుబడి విధేయతతో పనిచేసి ఆయన నమ్మకాన్ని నిలబెడతానని అన్నారు. తాను డిప్యూటీ మేయర్ కావడానికి సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ కైవసం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మున్సిపల్ ఫలితాల అనంతరం ఉత్కంఠ రేపిన మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ పదవి ఎట్టకేలకు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సోమవారం ఏర్పాటు చేసిన చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 17వ వార్డు సభ్యుడిగా ఎన్నికైన మైలారపు లింబాద్రి చైర్మన్గా ఎన్నికయ్యారు.మొదటి వార్డు సభ్యుడుగా గెలిచిన ఓంకార్ నవీన్ వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. బిజెపి పార్టీకి 10 వార్డులు ఉన్నప్పటికీ బిజెపి పార్టీ నుండి గెలిచిన చెట్లపల్లి మీనా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడంతో 11 వార్డు సభ్యులతో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంది.బిఆర్ఎస్ పార్టీ ఆరు వార్డుల్లో గెలిచినప్పటికీ ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియ ఓటు ఉన్నప్పటికీ ఎవరికీ మద్దతు తెలుపలేదు. చివరకు అనుకున్నట్టే అధికార కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది.

## చేర్యాల మున్సిపల్ పీఠం బిఆర్ఎస్ కైవసం



**ప్రజాపక్షం/చేర్యాల:**చేర్యాల మున్సిపల్ పీఠాన్ని బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకొంది.సోమవారం పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి కార్యాలయంలో నోడల్ ఆఫీసర్,డిపిఒ రవిందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైర్మెన్,వైస్ చైర్మెన్‌ల ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ ఎన్నికకు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు 7 గురు,కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లు 5 గురు హాజరుకావడంతో ముందుగా12 వార్డుల కౌన్సిలర్‌లతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు.అనంతరం చైర్మెన్‌గా బిఆర్ఎస్ పార్టీకి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ ముత్యాల అరుణ బాల నరసయ్య,వైస్ చైర్మెన్‌గా 10వ వార్డు కౌన్సిలర్ మేడిశెట్టి ఉమ శ్రీధర్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ నాగేందర్,సీనియర్ అసిస్టెంట్ కృష్ణ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.సిఐ రమేష్,ఎస్ఐ నవీన్‌తో పాటు పోలీస్ సిబ్బంది బందోబస్తును నిర్వహించారు.

## మున్సిపల్ చైర్మన్‌గా నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్‌గా ముస్కాన్ నాజ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :**పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ గా నూగిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్ గా ముస్కాన్ నాజ్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం రోజున మున్సిపల్ కార్యాలయం మున్సిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్ పర్సన్ ఎన్నిక సందర్భంగా ఇటీవల 21వ వార్డు నుండి గెలుపొందిన నూగిల్ల మల్లయ్య,36వ వార్డు నుండి గెలుపొందిన ముస్కాన్ నాజ్ వైస్ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రీసిడింగ్ అధికారి పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య ప్రకటించారు. అనంతరం 34 వార్డులకు చెందిన కౌన్సిలర్లు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్,గౌరవకౌన్సిలర్లు,టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, కిరణ్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, కృష్ణ రెడి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెబ్ కాస్టింగ్ సెంటర్‌లో పరిశీలన

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ సెంటర్ ను ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రక్రియ కొనసాగుతుండగా, వెబ్ కాస్టింగ్ సెంటర్ ద్వారా పరిశీలించారు.

**వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో పరిశీలన..**

అంతకుముందు వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించే క్రమంలో కౌన్సిల్ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టారు. ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ హాజరై సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని పరిశీలించారు.

## నాలుగు మున్సిపాల్టీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు నారీమణులకే



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** జిల్లాలోని చేర్యాల. దుబ్బాక, గజ్వేల్‌ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్ మున్సిపాల్టీల్లో నూతన చైర్మన్,వైస్ చైర్మన్‌లతో పాటు పాలక వర్గం కొలువు దీరటంతో మున్సిపల్ ఎన్నికల చివరి ఘట్టం ప్రశాంతగా ముగిసింది. సిద్దిపేట జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు మహిళలే దక్కించుకోవటం విశేషం. సిద్దిపేట మున్సిపాల్టీ పాలకవర్గం మరో రెండున్నర నెలల గడవు ఉండటం ఎన్నికల జరుగలేదు. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలు గజ్వేల్, హుస్నాబాద్. దుబ్బాక. చేర్యాల మున్సిపాల్టీలోని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను అతివలే అధిరోహించారు. హుస్నాబాద్ చైర్మన్ ఎస్సీ జనరల్‌కు, చేర్యాల ఎస్సీ మహిళ. గజ్వేల్ ప్రజ్ఞాపూర్, దుబ్బాక మున్సిపల్ చైర్మన్ పదవులు బిసి మహిళలకు రిజర్వు కాబడ్డాయి. హుస్నాబాద్ మున్సిపాల్టీలో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంది. గజ్వేల్,ప్రజ్ఞాపూర్, దుబ్బాక. చేర్యాల మున్సిపాల్టీ చైర్మన్ పదవులను బిఆర్ఎస్ కైవసం చేసుకుంది. హుస్నాబాద్, దుబ్బాక. చేర్యాల, గజ్వేల్ మున్సిపల్ కౌన్సిలర్లు క్యాంపుకు తరలివెళ్లి సోమవారం నిర్వహించిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు నేరుగా మున్సిపల్ కార్యాలయాలకు చేరుకున్నారు. ముందుగా నూతనంగా గెలిచిన కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆనంతరం పార్టీ అధిష్టానం చైర్మన్, వైస్ చైర్మన్‌లను పేర్లను ఖరారు చేస్తూ పంపిన సీల్డు కవర్‌ను ఎన్నికల అధికారి తెరిచి అందులో ఉన్న పేర్లను వినిపించటంతో సభ్యులు ఏకగ్రీవంగా అమోదించారు. హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా దండి లక్ష్మి ,వైస్ చైర్మన్‌గా చిత్తారిపద్మ, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా గంగిశెట్టి శెట్టి చందన, వైస్ చైర్మన్‌గా కళ్యాణ్‌కార్ పద్మబాయిలు ఎన్నికైనారు. చేర్యాల మున్సిపల్ చైర్మన్‌గా ముస్త్యాల అరుణ, వైస్ చైర్మన్‌గా మేడిశెట్టి ఉమ, దుబ్బాక మున్సిపల్ చైర్మన్‌గా శ్రీరాం సంగీత, వైస్ చైర్మన్‌గా ఆస సులోచనలు ప్రమాణ స్వీకారం చేశారు. హుస్నాబాద్‌లో జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే,మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. మహిళమణుల నాయకత్వంలో పురపాలక సంఘాలు పురోగతి సాధిస్తాయా? లేకా తిరుగమణంవైపు అడుగులు పడుతాయా అనేది తెలియాలంటే వేచిచూడాల్సిందే!

## కంటికి కన్పించని కుట్రలెన్నో చేశారు

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**ప్రజాపక్షం/కరీంనగర్:**మెజారిటీ సీట్లు సాధించిన బిజెపికి మేయర్, డిప్యూటీ మేయర్ పదవి దక్కకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, బిఆర్ఎస్, ఎంఐఎంతో కలిసి చేయని కుట్రలు లేవని, అయినా బండి సంజయ్ రాజకీయం ముందు, బిజెపి సైనికుల పోరాట పటిమ ముందు మీ కుట్రలన్నీ పటాపంచలైనయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ లో సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం... నూతనంగా ఎన్నికైన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బిజెపి కార్పొరేటర్లతో కలిసి మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటి కావడానికి కారణమేంటి? ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఫాంహౌజ్ వేదికగా కుట్రలు ఎందుకు చేశారు? ఎవరిపై మీ కోపం? కాంగ్రెస్ గెలిచింది 14 సీట్లు, ఎంఐఎం గెలిచింది 3 సీట్లు, బిఆర్ఎస్ గెలిచింది 9 సీట్లు, అన్నీ కలుపుకున్నా 26 సీట్లు మాత్రమే. మ్యాజిక్ ఫిగర్ దాటనే లేదు. ఇవన్నీ తెలిసి ఎందుకు బిజెపిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మీ చీకటి ఒప్పందాలేమిటి? బిజెపిని ఓడించేందుకు చెప్పలేని, కంటికి కన్పించని కుట్రలెన్నో చేశారని, అధికారం చేతిలో ఉంది కదా అని... బిజెపి 30 సీట్లు సాధించినా, ఇండిపెండెంట్లు మావైపు ఉన్నా, మమ్ముల్ని ఓడించేందుకు కుట్రలు జరిగాయని బండి సంజయ్ మండి పడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలుకుని మంత్రులు, కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ కలిసి రెండ్రోజులుగా జరుగుతున్న కుట్రలను చూసి ప్రజలే విస్తుపోయారన్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగాలన్నా, తెలంగాణ వచ్చినా కరీంనగర్ వేదికగా మార్పు మొదలైన సంగతి తె లిసిందేనన్నారు. అందులో భాగంగానే కరీంనగర్ మే యర్ పదవిని బిజెపి కైవసం చేసుకుంటే రాష్ట్రంలోనూ బిజెపిఅధికారంలోకి రావడం తథ్యమనే భయంతో కా ంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలన్నీ ఒక్కటై కుట్ర చేశాయన్నారు. మేయర్ గా కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మే యర్ సునీల్ రావు ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉ ందని, అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేస్తారని, ప్రజలకు అండగా ఉంటూ కరీంనగర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తారని, ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తరువాత అభివృద్ధే మా లక్ష్యమని, ఇందుకోసం అన్ని పార్టీలు కలిసి రావాలని కోరుతున్నానన్నారు.

## హామీలు నెరవేర్చాకే విజయోత్సవాలు

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ప్రజాపక్షం/ధర్మపురి :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ఆరు నెలల్లో పూర్తిచేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి అవి పూర్తిచేసాకే విజయోత్సవాలు జరుపుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి మున్సిపల్ నూతన పాలకవర్గ సభ్యులకు సూచించారు. పురకార్యాలయంలో సోమవారం జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక తోపాటు సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మపురి పట్టణ ప్రజలు తనపై పూర్తి విశ్వాసం వుంచి 15 వార్డుల్లో 15 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని వారికి సదా రుణపడి ఉంటానని అన్నారు.2009 నుండి ఎన్నికల్లో గెలిచినా ఓడినా ప్రజల మద్యవుంటూ వారి కష్టసుఖాలలో తోడువున్నానని అందుకే తనపై ప్రజలు నమ్మకం వుంచారని ఆ నమ్మకాన్ని వమ్ము చేయక పట్టణాభివృద్ధి కి శాయశక్తులా కృషిచేస్తానని చెప్పారు.మున్సిపల్ చైర్ పర్సన్ స్థానానికి వేముల నాగలక్ష్మి , సంగనబట్ల సంతోషిలు పోటీపడ్డారనిపిసిసిఅధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నిర్ణయంతో నాగలక్ష్మి చైర్ పర్సన్ గా ఎంపికైనట్లు మంత్రి వివరించారు. మొదటి రెండు ఏళ్ళు నాగలక్ష్మి , తర్వాత మూడేళ్లు సంతోషి చైర్మన్‌గా కొనసాగుతారని మంత్రి పేర్కొన్నారు. చైర్మన్ స్థానాన్ని ఆశించిన సంతోషి భర్త దినేష్ కు త్వరలోనే ఉన్నత స్థాయి పదవి ఇచ్చి గౌరవిస్తామని మంత్రి అడ్లూరి చెప్పారు.కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు ఎవరూ విజయోత్సవాలు చేసుకోవద్దని ఇచ్చిన హామీలు పూర్తిచేసాకే ఆ సంబరాలు జరుపుకోవలన్నారు.ఓట్లేసి గెలిపించిన వార్డు ప్రజలను వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు తెలపాలని కౌన్సిలర్లకు మంత్రి లక్ష్మణ్ కుమార్ సూచించారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దండి లక్ష్మి



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :**హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 14 వార్డు సభ్యురాలు దండి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హుస్నాబాద్ మున్సిపల్ సభ్యుల ప్రత్యేక సమావేశం ఎన్నికల అధికారి అర్‌డివో అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. హుస్నాబాద మున్సిపల్ లో మొత్తం 20సభ్యులు ఎక్స్‌ఫిషేయో సభ్యుగా మంత్రితో 21 మంఇ అయ్యారు. తొలుత సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. 14వార్డు సభ్యురాలు దండి లక్ష్మి ని 1 వార్డు సభ్యురాలు చెన్నమేని ఆనూష ప్రపోజ్ చేయగా, 15 వార్డు సభ్యురాలు ఆకుల రజిత , 20వార్డు సభ్యుడు గోపగాని శోభన్‌లు బలపరిచారు. ఇతరులు ఎవ్వరు పోటీలో లేక పోవడంతో దండి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ప్రకటించారు. అలాగే వైస్ చైర్‌పర్సన్‌గా 7 వార్డు సభ్యురాలైన చిత్తారి పద్మ ను పల్లి తిరుపతి ప్రతిపాదించగా బొలిశెట్టి రాజు వైద్యం కిరణ్‌ప్రసాద్ బలరిచారు. ఇతరులు పోటీలేనందున చిత్తారి పద్మను వైస్ చైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక ఆయినట్లు ప్రకటించారు. చైర్మెన్ , వైస్ చైర్మెన్ లను ఎన్నికల అధికారి రాంమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్బగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు నూతన పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలపారు. మంత్రిగా మీకు పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ బిఅర్ ఎస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కరీంనగర్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా


**కరీంనగర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు**



**ప్రజాపక్షం/కరీంనగర్:**కరీంనగర్ నగర పాలక సంస్థలో కొత్తగా ఏర్పడిన బిజెపి పాలకవర్గం ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా నిరంతరం పర్యవేక్షణ చేసేందుకు ఒక ప్రత్యేక నిఘా వ్యవస్థ విజిలెన్స్ సెల్ ఆర్గనైజేషన్ ను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన కార్పొరేటర్ మేయర్ గా పని చేసిన వ్యక్తి డిప్యూటీ మేయర్ గా ఎన్నిక కావడం పట్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. సోమవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతో కలిసి వెలిచాల రాజేందర్ రావు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్రావు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ లో చిన్న అవినీతి జరిగినా విడిచిపెట్టే ప్రసక్తి లేదని ప్రతి డివిజన్లో జరిగే అభివృద్ధి పనులు బిల్డింగ్ పర్మిషన్లు ఇతరత్రా పనులపై పర్యవేక్షణకు ప్రత్యేక విజిలెన్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి పని ప్రతి పేమెంటు మానిటరింగ్ చేసి నాణ్యత పరిశీలించి ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా కృషి చేస్తామన్నారు. ప్రజలను అవినీతి అక్రమాల నుంచి కాపాడుతామని స్పష్టం చేశారు. బిజెపి పాలకవర్గం అవినీతి అక్రమాలకు పాల్పడకుండా నిరంతరం నిఘా పెడతామని తేడాలు వస్తే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని బిజెపి పాలకవర్గం జాగ్రత్తగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. గత బిఆర్ఎస్ హాయంలో జరిగినట్లు అవినీతి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నాడు కేంద్రమంత్రి బండి సంజయ్ సునీల్ రావు అవినీతిపరుడని అనేకసార్లు విమర్శించి పార్టీలో చేర్చుకున్నారని ఆరోపించారు. నాడు విమర్శించి నేడు మళ్ళీ డిప్యూటీ మేయర్గా ఎంపిక చేయడంపై ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. అవినీతిపరులను పార్టీలో చేర్చుకొని మళ్లీ పదవులు ఇవ్వడం పట్ల విస్మయం కలుగుతుందన్నారు. కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, భాస్కర్ నాయక్, గుమ్మడి రాజకుమార్, ఆకుల నందిని ఉదయ్, పడిశెట్టి వసంత లక్ష్మి భూమయ్య, కల్లేపల్లి శారద బాలరాజు, సికిందర్ ఇక్రమ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల మున్సిపల్ పీఠం కాంగ్రెస్ వశం

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌దే పైచేయి✻ చైర్ పర్సన్‌గా సమిండ్ల వాణి, వైస్ చైర్ పర్సన్‌గా జీనత్ పర్వీన్**



**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపికలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వకపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. కేవలం వైస్ చైర్ పర్సన్ పదవిని మాత్రమే ఇవ్వడంతో చైర్ పదవిని ఆశించిన కౌన్సిలర్లకు నిరాశే మిగిలింది. మొదటి నుండి జగిత్యాల మున్సిపల్ ఎన్నిక విషయంలో బీ ఫారముల జారీతో పాటు టికెట్ల కేటాయింపు, చైర్ పదవీ రాకతో సంజయ్ కుమార్ వర్గానిదే పై చేయిగా మారింది. జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల ప్రత్యేకాధికారి మదన్ మోహన్ ఆధ్వర్యంలో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అందజేసిన చైర్ పర్సన్ ,వైస్ చైర్ పర్సన్ అభ్యర్థుల బీ ఫారంలతో పాటు విప్ జారీ పత్రాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్ రావు, 16వ వార్డు కౌన్సిలర్ దుమాల రాజ్ కుమార్‌తో కలిసి ఎన్నికల అధికారికి అందజేశారు. జగిత్యాల మున్సిపల్‌లో 50 వార్డులు ఉండగా 23 మంది కాంగ్రెస్, ఆరుగురు బిజెపి, నలుగురు బిఆర్ఎస్, ఇద్దరు ఎఐఎంఐఎం నుంచి 15 మంది స్వతంత్రులుగా విజయం సాధించారు. చైర్ పర్సన్ ఎన్నికకు 50 మంది హాజరు కాగా అందరితో ప్రత్యేకాధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ నుంచి చైర్ పర్సన్ అభ్యర్థిగా 43 వార్డు కౌన్సిలర్ సమిండ్ల వాణిని 18వ వార్డు కౌన్సిలర్ కూతురు శేఖర్ ప్రతిపాదించగా 27వ వార్డు కౌన్సిలర్ జుంబర్తి గంగలక్ష్మి బలపరిచారు. బిజెపి నుండి చైర్ పర్సన్ అభ్యర్థిగా 48 వార్డు కౌన్సిలర్ కొండ అరుణను 45వ వార్డు కౌన్సిలర్ గట్టెపల్లి మానస ప్రతిపాదించగా 5వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రీనివాస్ బలపరిచారు. 39 మంది సమిండ్ల వాణికి మద్దతుగా చేయి ఎత్తగా విజయం సాధించారు. అనంతరం వైస్ చైర్మన్ పదవీ కోసం 35వ వార్డు కౌన్సిలర్ జీనత్ పర్వీన్‌ను 20వ వార్డు కౌన్సిలర్ కూతురు శేఖర్ ప్రతిపాదించగా 17వ వార్డు కౌన్సిలర్ ఖాజా కమాలోద్దీన్ బలపరిచారు. అనంతరం నూతన చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లు ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడారు. అనంతరం నూతన చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంతో మున్సిపల్ కమిషనర్ స్పందన తదితరులు ఉన్నారు.

## అభివృద్ధికి సంక్షేమానికే ప్రజలు పట్టం కట్టారు: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/చొప్పదండి:**కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమానికి చొప్పదండి మున్సిపల్ ప్రజలు పట్టం కట్టారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల పదవీ బాద్యతలు చేపట్టిన సంధర్బంగా వారిని సన్మానించి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలకతీతంగా చొప్పదండి మున్సిపాలిటీని మోడరన్‌గా మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొప్పదండి మున్సిపాలిటీ, నియోజకవర్గ సమస్యలపై సానుకూలంగా స్పందించారని ఈ సంధర్బంగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించిన పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. చైర్‌పర్సన్ వడ్లూరి సరిత మాట్లాడుతూ తనపై నమ్మకంతో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో గెలిపించిన ఒకటో వార్డు సభ్యులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. చొప్పదండి మున్సిపాలిటీ అభివృద్దే ద్యేయమని ఆమె పేర్కొన్నారు.

## కొలువుదీరిన లక్సెట్టిపేట మున్సిపల్ కొత్త పాలకవర్గం

మున్సిపల్ చైర్మన్‌గా దొంత అంజలి, వైస్ చైర్మన్‌గా మోత్కూరి రాజేశ్వరి ఎన్నిక




**ప్రజాపక్షం/లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట మున్సిపాలిటీలో కొత్తగా ఎన్నికైన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. మున్సిపల్ కార్యాలయంలో నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులతో తహశీల్దార్ దిలీప్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయించి, వారికి గెలుపు పత్రాలను అందజేశారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలో మున్సిపల్ చైర్మన్‌గా రెండో వార్డు కౌన్సిలర్ దొంత అంజలి, వైస్ చైర్మన్‌గా నాలుగో వార్డు కౌన్సిలర్ మోత్కూరి రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించింది. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెన్నూరు మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

చైర్మన్‌గా పెద్దింటి పద్మ, వైస్ చైర్మన్‌గా నాయకపు వినయ్ ఎన్నిక




**ప్రజాపక్షం/చెన్నూరు :** చెన్నూరు మున్సిపల్ నూతన పాలకవర్గ ఎంపిక ప్రక్రియ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉత్కంఠ భరితంగా ముగిసింది. కౌన్సిలర్ల మెజారిటీ మద్దతుతో రెండో వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ పెద్దింటి పద్మను మున్సిపల్ ఛైర్మన్‌గా, ఆరో వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ నాయకపు వినయ్‌ను వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకున్నట్లు ఎన్నికల ప్రత్యేకాధికారి కిషన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

చైర్‌పర్సన్‌గా దావా స్వాతి, వైస్ చైర్మన్‌గా రాగంశెట్టి సత్యనారాయణ




**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఏడో వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ దావా స్వాతి, వైస్ చైర్మన్‌గా 17వ వార్డు కౌన్సిలర్ రాగంశెట్టి సత్యనారాయణ సోమవారం ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో వీరు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. చైర్‌పర్సన్ ఎన్నికలో దావా స్వాతికి 20 మంది కౌన్సిలర్లు మద్దతుగా నిలిచారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం చైర్‌పర్సన్ పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ ముగిసింది. స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన ఐదుగురు సభ్యుల మద్దతు కూడా కీలకంగా మారింది. కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం వెలుపల పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, ఎన్నికల అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## మున్సిపల్ చైర్మన్‌గా చందన రవీందర్ ఎన్నిక వైస్ చైర్మన్‌గా పద్మాబాయి నర్సింగరావు

**ప్రజాపక్షం/గజ్వేల్ :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా గంగిశెట్టి చందన రవీందర్ ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి, ఆర్డీవో చంద్రకళ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించగా, 20 మంది వార్డు సభ్యులతో పాటు ఎక్స్ అఫీషియా సభ్యులుగా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి హాజరయ్యారు. మొదటగా ఆర్డీవో వారిచే ప్రమాణ స్వీకారం చేయించగా, అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియ ప్రకటించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నుండి చైర్మన్ పదవికి నాయిని సత్యలక్ష్మి యాదగిరి పోటీపడగా, బిఆర్ఎస్ పార్టీ నుండి గంగిశెట్టి చందన రవీందర్ బరిలో దిగారు. అయితే ఎక్స్ అఫీషియా సభ్యులుగా నమోదు చేసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డితో పాటు 11 మంది బిఆర్ఎస్ వార్డు సభ్యులు, బిజెపి, స్వతంత్ర కౌన్సిలర్లు బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి చందన రవీందర్ కు మద్దతుగా చేతులెత్తగా, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన చైర్మన్ అభ్యర్థి నాయిని సత్యలక్ష్మి యాదగిరికి ఏడుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్దతు పలికారు. దీంతో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి చందన రవీందర్ చైర్మన్ గా ఎన్నికైనట్లు ఆర్డీవో చంద్రకళ ప్రకటించారు. అనంతరం వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కాగా, బిఆర్ఎస్ నుండి పద్మాబాయి నర్సింగరావు బరిలో దిగగా, కాంగ్రెస్ పార్టీ నుండి గుంటూాకు లక్ష్మి శ్రీనివాస్ పోటీలో నిలిచారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మాభాయి నర్సింగరావుకు 14 మంది అనుకూలంగా చేతులెత్తగా, కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మి శ్రీనివాస్ కు ఏడుగురు సభ్యులు మద్దతు పలికారు. దీంతో వైస్ చైర్మన్‌గా పద్మాబాయి, నర్సింగరావు, ఎన్నికైనట్లు ఆర్డీవో చంద్రకళ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కోరం లేక క్యాతనపల్లి పురపాలక ప్రమాణ స్వీకారం వాయిదా

మంగళవారానికి సమావేశం వాయిదా వేసిన అధికారులు

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ఛైర్‌పర్సన్, కౌన్సిలర్ల ప్రత్యేక సమావేశం కోరం లేక వాయిదా పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఛైర్‌పర్సన్ స్థానంతో పాటు కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాకపోవడంతో కోరం పూర్తి కాలేదు. కనీస సభ్యుల సంఖ్య లేకపోవడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించడం సాధ్యం కాదని అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో సమావేశాన్ని ఫిబ్రవరి 17 మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయంలోనే ఈ ప్రక్రియను తిరిగి చేపడతామని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు ఎవరూ రాకపోవడంతో ప్రమాణ స్వీకారం వాయిదా పడటం స్థానిక పురపాలక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఉత్కంఠ మధ్య నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

మున్సిపల్ చైర్మన్‌గా మాచునూరి లక్ష్మీ, రాజు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా వనముల బుచ్చేశ్ యాదవ్




**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారి ఉత్కంఠల మధ్యన జరిగింది. మున్సిపల్ చైర్మన్ పీఠం ఏ పార్టీ దక్కించుకుంటుందోనని పలువురు ఆసక్తిగా ఎదురుచూశారు. ఇటీవల జరిగిన నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు 6 మంది గెలుపొందగా టిఆర్ఎస్ 5 మంది కౌన్సిలర్ అభ్యర్థులు ఎన్నిక కాగా, బిజెపి అభ్యర్థులు 4గురు మాత్రమే కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఈమేరకు ఏ పార్టీకి చైర్మన్ పదవి పొందడానికి మెజార్టీ లేనందున అందరూ అయోమయ పరిస్థితిలో మూడు పార్టీలు క్యాంపులో ఉన్నారు. ఎన్నికల అధికారుల సూచనల మేరకు సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనుండగా కౌన్సిలర్‌గా గెలిచిన అన్ని పార్టీల కౌన్సిలర్ అభ్యర్థులు అందరూ మొదటగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ఏ పార్టీకి చెందిన వారు చైర్మన్, వైస్ చైర్మన్ అవుతారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మేరకు ఎమ్మెల్యే సునీతరెడ్డి బిజెపి పార్టీ నాయకులతో మంతనాలు జరిపినట్లు తెలిసింది. అయితే బిజెపి నాయకులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బిజెపి నాయకులతో చర్చలు జరిపి ఒక కొలిక్కి వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరపున 6 మంది కౌన్సిలర్ గెలిచినందున వారికి చైర్మన్ పదవి, బిజెపి పార్టీ తరపున గెలిచిన 4 గురు కౌన్సిలర్‌లలో వైస్ చైర్మన్ పదవి తీసుకోవడానికి అంగీకరించారు. అనంతరం వారు నేరుగా నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చేసి తమ చైర్మన్ వైస్ చైర్మన్‌ల కోసం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున 5వ వార్డు నుంచి గెలుపొందిన మాచునూరి లక్ష్మి రాజు యాదవ్‌ను చైర్మన్‌గా ప్రతిపాదించారు. దీంతో ఎన్నికల అధికారి మెదక్ ఆర్డీఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డిలు తహసీల్దార్, శ్రీనివాస్‌లు ఓటింగ్ ప్రక్రియను పరిశీలించి నర్సాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా బిజెపి కౌన్సిలర్ బుచ్చేశ్ యాదవ్‌ను వైస్ చైర్మన్‌గా ప్రకటించారు. ఈ మేరకు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా మాచునూరి లక్ష్మిరాజు యాదవ్‌ను చైర్మన్ పీఠంలో కూర్చోబెట్టగా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బుచ్చేశ్ యాదవ్‌ను ప్రకటించారు.

# రెండు దశాబ్దాల ఏకఛత్రాధిపత్యానికి తెర

బైంసా చైర్మన్‌గా తూము దత్త్రాత్రి చరిత్రాత్మక విజయం

ఎంఐఎం కోటలో 'స్వతంత్ర బావుటా

15 మంది మద్దతుతో మున్సిపల్ పీఠం దక్కించుకున్న దత్త్రాత్రి




**ప్రజాపక్షం/బైంసా :** నిర్మల్ జిల్లా బైంసా మున్సిపాలిటీలో గత రెండు దశాబ్దాలుగా తిరుగులేకుండా సాగుతున్న ఎంఐఎం ఆధిపత్యానికి తెరపడింది. ఎవరూ ఊహించని విధంగా స్వతంత్ర అభ్యర్థులు మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లోనే ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోయింది. మున్సిపల్ చైర్మన్‌గా స్వతంత్ర అభ్యర్థి తూము దత్త్రాత్రి, వైస్ చైర్మన్‌గా బిబి కూతుజ సిద్ధికి ఎన్నికవడంతో బైంసా పురపాలికలో సరికొత్త పాలనాశకం ప్రారంభమైంది. మతపరమైన సమీకరణాలను పక్కన పెట్టి, పట్టణ శాంతిభద్రతలు, అభివృద్ధి కోసం కౌన్సిలర్లు తీసుకున్న నిర్ణయం ఒక గొప్ప సామాజిక మార్పుకు నాంది పలికింది.

**సంపూర్ణ మెజారిటీతో దత్త్రాత్రి పట్టాభిషేకం..**

మొత్తం 26 వార్డులున్న బైంసా మున్సిపాలిటీలో చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్‌ను తూము దత్త్రాత్రి సునాయాసంగా అందుకున్నారు. ఎన్నికల బరిలో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు, ఆరుగురు బిజెపి కౌన్సిలర్లు, ఒక కాంగ్రెస్ కౌన్సిలర్ ఆయనకు మద్దతు తెలిపారు. వీరికి తోడుగా స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ తన ఎక్స్ ఆఫీసియో ఓటును దత్త్రాత్రికి వేయడంతో మొత్తం 15 మంది సభ్యుల అండతో ఆయన చైర్మన్ పదవిని కైవసం చేసుకున్నారు.మరోవైపు,11 మంది ఎంఐఎం కౌన్సిలర్లు సమావేవానికి హాజరైనప్పటికీ,వ్యూహాత్మక మార్పుల నేపథ్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జబీర్ అహ్మద్ ఈ ప్రక్రియ దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది..

**మత సామరస్యానికి వేదికగా 'హిందూ-ముస్లిం' ఐక్యత..**

ఎన్నిక ప్రక్రియ ముగిసి ఫలితం వెలువడగానే మున్సిపల్ కార్యాలయం వెలుపల అపూర్వమైన దృశ్యం ఆవిష్కృతమైంది. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లిం సోదరులందరూ ఏకమై ''హిందూ, ముస్లిం భాయ్ భాయ్''అంటూ చేసిన నినాదాలతో బైంసా పురవీధులు మార్మోగాయి. గత ఇరవై ఏళ్లుగా ఎంఐఎం ఆధిపత్యంలో ఉన్న బైంసాలో, ఈసారి ప్రజలు మత కల్లోలాలు సృష్టించే శక్తులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం ఈ ఎన్నిక ద్వారా స్పష్టమైంది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ భర్త ఇద్రిస్ మాట్లాడుతూ..''ఇది కేవలం ఒక పార్టీ గెలుపు కాదని,ఇది బైంసా ప్రజల గెలుపు, బైంసా ఇకపై కమ్యూనల్ ప్రాంతం కాదని, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలందరూ సోదరభావంతో కలిసి ఉండే ప్రశాంత నిలయం'' అని ఉద్వేగంగా పేర్కొన్నారు.



## మున్సిపల్ ఎన్నికకు 'కోరం' అడ్డంకి

వాయిదా పడ్డ కాగజ్‌నగర్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో సోమవారం జరగాల్సిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కోరం లేక వాయిదా పడింది. ప్రత్యేక సమావేశానికి నిర్ణీత సంఖ్యలో సభ్యులు హాజరుకాకపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉదయం నిర్ణయించిన సమయానికి కేవలం 14 మంది సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మొత్తం సభ్యులలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన 11 మంది, ఇద్దరు స్వతంత్ర సభ్యులు, ఎంఐఎంకు చెందిన ఒక సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన సభ్యులతో పాటు మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. ఎన్నిక నిర్వహించడానికి అవసరమైన కనీస సభ్యుల సంఖ్య లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి ఎన్నిక ప్రక్రియను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## బెల్లంపల్లి అభివృద్ధికి సమష్టి కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో కలిసి ఎంఎల్ఏ గడ్డం వినోద్ వెల్లడి

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని, బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఎంఎల్ఏ గడ్డం వినోద్ పిలుపునిచ్చారు. సోమవారం ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి, వైస్ చైర్మన్ రాగం శెట్టి సత్యనారాయణతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రెండు దశాబ్దాల తర్వాత బెల్లంపల్లి పురపాలక పగ్గాలు కాంగ్రెస్ పార్టీకి దక్కాయని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. మున్సిపల్ పాలకవర్గం సరిగా పనిచేయకపోతే చైతన్యవంతులైన బెల్లంపల్లి ప్రజలు ప్రశ్నించే అవకాశం ఉంటుందని, ఆ పరిస్థితి తలెత్తకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు కోరుతామని, ఇప్పటికే రూ.20కోట్లతో వివిధ పనులు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో నూతన కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే ఉత్తమ కార్పొరేషన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు..

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపల్ కార్పొరేషన్‌గా మంచిర్యాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తానని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి కోఅప్షన్ సభ్యునిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన మంచిర్యాల మున్సిపల్ మేయర్ గా 32 మున్సిపల్ కార్పొరేషన్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్‌గా 54వ డివిజన్ కార్పొరేటర్ సల్ల రమ్మలను ఎన్నుకున్న అనంతరం వారిని అభినందించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అన్ని డివిజన్‌లలో అభివృద్ధి చెందేలా కార్పొరేటర్లు పనిచేయాలని, ఇందుకు తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు.

## చైర్‌పర్సన్‌గా బోదిరే నాగమణి, వైస్‌చైర్మన్‌గా చంటి లత

మున్సిపల్ నూతన చైర్మన్‌గా బోదిరే నాగమణి ప్రమాణ స్వీకారం




**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ మున్సిపల్ నూతన చైర్మన్‌గా బోదిరే నాగమణి, వైస్‌చైర్మన్‌గా చంటి లత సోమవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేకాధికారి సాయగౌడ్ వీరిద్దరితో పదవి బాధ్యతలు స్వీకరింపజేశారు. ముందుగా 12 వార్డులలో గెలుపొందిన కౌన్సిలర్లను ప్రమాణ స్వీకారం చేయించారు. మొదటి వార్డు నుండి నాగుల శ్రీజ నాగేంద్ర, రెండవ వార్డు పర్స కుశలత 3వ వార్డు తోట సతీష్, 4వ వార్డు బాల లక్ష్మి, 5వ వార్డు బోదిరే లావణ్య, 6వ వార్డు నాగమణి, 7వ వార్డు అంజుమ్ అలీ, 8వ వార్డు సందీప్, 9వ వార్డు నీలం రవి, 10వ వార్డు సంటి లత, 11వ వార్డు సంగ్యానాయక్, 12వ వార్డు మల్లెల అనుపమ ప్రసాద్‌లను ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం హాల్ నుండి టిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికైన నలుగురు కౌన్సిలర్లు బయటకు రావటం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ల ఎంపికను ప్రత్యేకాధికారి సాయిగౌడ్ ప్రారంభించారు. చైర్మన్ అభ్యర్థిగా బోదిరే నాగమణిని 1వ వార్డు కౌన్సిలర్ శ్రీజ ప్రతిపాదించటంతో 3వ వార్డు అభ్యర్థి సతీష్ బలపర్చారు. ఎన్నిక లాంఛనం కావటంతో చైర్మన్‌గా బోదిరె నాగమణి ఎన్నికైనట్లు ప్రత్యేకాధికారి ప్రకటించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా సంటి లతను రెండవ వార్డు అభ్యర్థి కుశ లత ప్రతిపాదించటంతో 8వ వార్డు అభ్యర్థి సందీప్ బలపర్చారు. దీంతో వైస్‌చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రత్యేకాధికారి ప్రకటించారు. అనంతరం వారికి పుష్పగుచ్ఛమిచ్చి శాలువతో సన్మానించారు.

## మంచిర్యాల తొలి మేయర్‌గా మధుకర్, డిప్యూటీ మేయర్‌గా రమ్య

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా 32వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్‌గా 54వ డివిజన్ కార్పొరేటర్ సల్ల రమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో మొదట ఎన్నికల పరిశీలకులు కె.గంగాధర్, ప్రత్యేక అధికారి ఆర్డీఓ శ్రీనివారావు నూతనంగా ఇటీవల గెలుపొందిన 60 మంది కార్పొరేటర్లతో తెలుగు అక్షరమాల క్రమంలో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికకు మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ద్వారా అధిష్టానం విప్ జారీ చేసిందని తెలిపారు. దీంతో ప్రమాణ స్వీకారం చేసిన భారాస కార్పొరేటర్లు అక్కడినుండి వెళ్ళిపోయారు. దీంతో మేజార్టీ కార్పొరేటర్లు ఉండటంతో విప్ ప్రకారం మేయర్ అభ్యర్థిగా ధర్ని మధుకర్‌ను కార్పొరేటర్ తూముల నరేష్ ప్రతిపాదించగా కార్పొరేటర్లు సుదమల్ల హరికృష్ణ, నోముల సదానందం, చింతపండు శ్రీధర్, గంగాధరపు వెంకటేష్‌లు బలపర్చారు. ఐదు నిమిషాల సమయం ఇచ్చినగా మరో మేయర్ నామినేషన్ రాకపోవడంతో మధుకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయర్‌గా సల్ల రమ్మను నామినేట్ చేయగా కార్పొరేటర్ పెంట రజిత ప్రతిపాదించగా పుట్ట యశోద, బియ్యాల త్రివేణి, గంగారపు వెంకటేశ్వర్లు బలపర్చడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. దీంతో మేయర్, డిప్యూటీ మేయర్‌లను కార్పొరేటర్లు, అభిమానులు, అధికారులు అభినందించారు.

# క్యాతనపల్లి మున్సిపాలిటీలో రాజకీయ హైడ్రామా

కాంగ్రెస్ ఓవర్ యాక్షన్‌తో మున్సిపల్ ప్రమాణస్వీకారానికి అడ్డంకులు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గం క్యాతనపల్లి మున్సిపాలిటీలో సోమవారం జరిగిన పరిణామాలు రాజకీయ హైడ్రామాను తలపించాయి. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చినప్పటికీ నూతన కౌన్సిలర్ల ప్రమాణస్వీకార కార్యక్రమం అర్థాంతరంగా వాయిదా పడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. 22 వార్డులున్న ఈ మున్సిపాలిటీలో భారత రాష్ట్ర సమితి, సిపిఐ పొత్తు 14 వార్డుల్లో విజయం సాధించి పూర్తి మెజారిటీని దక్కించుకున్నాయి. అయితే మెజారిటీపక్షం పీఠం అధిష్టించాల్సిన తరుణంలో చోటుచేసుకున్న అడ్డంకులు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం వస్తున్న కౌన్సిలర్ల వాహనాలను పోలీసులు మున్సిపల్ కార్యాలయానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేశారు. దీంతో గెలిచిన ప్రతినిధులు కాలినడకన కార్యాలయానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీగా మోహరించిన పోలీసులు కౌన్సిలర్ల రాకను నియంత్రించడం లోపలికి వెళ్లే క్రమంలో తీవ్ర జాప్యం జరగడం గమనార్హం. ప్రజాప్రతినిధులను కార్యాలయం వరకు రానివ్వకుండా అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కౌన్సిలర్లు కార్యాలయానికి చేరుకునేలోపే నిర్ణీత సమయానికి రాలేదన్న సాకుతో ఎన్నికల అధికారి అయిన మందమర్రి తహసీల్దార్ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. పోలీసుల ఆంక్షల వల్ల ఆలస్యమైతే దానిని కారణంగా చూపి వాయిదా వేయడం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గెలిచిన పార్టీకి చైర్మన్ పీఠం దక్కకుండా చేసేందుకే అధికారులతో కుమ్మక్కై ఈ డ్రామా ఆడారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలు ఓటు ద్వారా ఇచ్చిన తీర్పును గౌరవించకుండా అధికార బలంతో అడ్డుకోవడం రాజకీయ అహంకారమేనని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి వైఫల్యాల వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఇతర పార్టీల కౌన్సిలర్లను ప్రలోభపెట్టి చైర్మన్ సీటు దక్కించుకోవాలనే కుట్రతోనే ఈ అడ్డంకులు సృష్టించారని బిఆర్ఎస్, సిపిఐ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రతిష్ట దెబ్బతినకుండా ఉండటం కోసమే ప్రజాస్వామ్య ప్రక్రియను కాలరాస్తున్నారని జిల్లా రాజకీయాల్లో చర్చ జరుగుతోంది.

# ఖానాపూర్ మున్సిపల్ పీఠంపై వీడని ఉత్కంఠ

కోరం లేక చైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా.!



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక తీవ్ర ఉత్కంఠకు దారితీసింది.ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో పాటు,ప్రధాన ప్రతిపక్షాల గైర్హాజరీ కారణంగా కోరం లేక ఎన్నిక నేటికి(మంగళవారం)వాయిదా పడింది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో బిజెపి 4, బిఆర్ఎస్ 4,కాంగ్రెస్ 3,స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానంలో విజయం సాధించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఎక్స్ అఫీషియో ఓటుతో ఆ పార్టీ బలం 5కి చేరుకున్నప్పటికీ,చైర్మన్ పీఠం దక్కించుకోవడానికి కాంగ్రెస్‌కు ఇంకా ఇద్దరు సభ్యుల మద్దతు అవసరం.మరోవైపు,బీజేపీ లేదా బీఆర్ఎస్ పీఠం దక్కించుకోవాలంటే ఆ పార్టీలు పరస్పరం సహకరించుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది..

**ప్రమాణ స్వీకారం..వాయిదా..!**

సోమవారం నిర్వహించిన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారానికి కేవలం అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు(గొర్రె తిరుమల,సాహిదాబేగం,పొలంపెల్లి రమేష్,చిన్నం సత్యనారాయణ) మాత్రమే హాజరయ్యారు. బీఆర్ఎస్,బీజేపీ కౌన్సిలర్లు రాకపోవడంతో చైర్మన్ ఎన్నికకు సరైన కోరం లేదని స్పెషల్ ఆఫీసర్ జీవరత్నం ఎన్నికను వాయిదా వేశారు..

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆగ్రహం..**

మున్సిపల్ ఎన్నిక వాయిదా పడటంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. తాము ఎన్నిక కోసం సిద్ధంగా ఉన్నప్పటికీ,ప్రతిపక్ష పార్టీలు రాకపోవడం సరికాదన్నారు.''రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో అన్నది కేవలం ఆ దేవుడే చెప్పాలి..అది దేవుడికే ఎరుక''అంటూ వ్యాఖ్యానించారు.ప్రతిపక్షాల తీరును ప్రజలు గమనించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

**నేటి ఎన్నికపై సర్వత్రా ఆసక్తి..** నేడు (మంగళవారం)జరగనున్న ఎన్నికలో పార్టీల మధ్య సయోధ్య కుదిరితేనే ఖానాపూర్ పురపాలిక చైర్మన్,వైస్ చైర్మన్ ఎవరనేది తేలనుంది.రాజకీయ సమీకరణాలు ఏ మలుపు తిరుగుతాయోనని నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

## కాంగ్రెస్, బిజెపి ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

అధికారంలో లేకున్నా 15 సీట్లు గెలిచాం

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ :** కాంగ్రెస్, బిజెపి పార్టీలకు వైరమున్న మెదక్ బల్దియాలో కాంగ్రెస్, బిజెపి, బిఎస్పీ సహకరించుకోవడం అనైతిక చర్య అని, కాంగ్రెస్ బిజెపి పార్టీలు ఢిల్లీలో కుస్తీ పడుతూ గల్లీలో దోస్తీ చేస్తున్నాయని మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిత్యం కాంగ్రెస్, బిజెపి నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ... మెదక్ మున్సిపల్ పోరులో ఇరు పార్టీలు సహకరించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి మెదక్ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని చెప్పారు. అభివృద్ధి పేరుతో ఎన్నికలు రాగానే ఇష్టం వచ్చిన వాగ్దానాలు చేస్తూ ప్రజలను ప్రలోభ పెడుతుందని గుర్తు చేశారు. పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులుతోపాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు రాజవ్వ, లలిత, స్వరూప, గంగామణి, జుబెర్ అహ్మద్, అనీస్ ఫాతిమా, సంధ్య, రాజశేఖర్, మహమ్మద్ గౌస్, శృతి, సోహెల్ మోహిద్దీన్, దీపక్, రాణి,ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మేయర్‌గా అవకాశం రావటం నా అదృష్టం

మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఉమారాణి కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్‌గా ఎన్నిక కావటం నా అదృష్టమని, అందుకు కృషి చేసిన టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని మేయర్ కూరగాయల ఉమారాణి అన్నారు. అందరి సహకారంతో మున్సిపల్ కార్పోరేషన్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. సామాన్య కార్యకర్తలైన నాకు ఈ అవకాశం కల్పించిన పార్టీకి రుణపడి ఉంటానన్నారు.

